## <u>సినిమా సమీక్ష</u>

# శంకరాభరణం, మా భూమి

**ఏవో** కొన్ని నిరసన గళాలు మినహాయిస్తే అవార్డు పొందిన తెలుగు సినిమా శంకరాభరణాన్ని అందరూ పోటీలుపడి పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. నిరసిస్తున్న ఆ కొందరిలో హైదరాబాద్‌కు చెందిన ఒక వామపక్ష విద్యార్థి సంఘం కూడా ఉంది. నటీనటులంతా బ్రాహ్మణులు కావడం పట్ల వారు అభ్యంతరం తెలిపారట! సినిమాను అర్థం చేసుకోవడంలో వారు సత్యానికి దగ్గరగా వచ్చినట్టే వచ్చి చివర్లో కాస్త దారి తప్పారు. నటీనటుల కులం 'రిజర్వేషనిస్టు' సంస్కరణ వాదులకు ముఖ్యం కాని వామపక్షీయులకు ఎందుకు? అయినా ఒకటి మాత్రం స్పష్టం. ఇది బ్రాహ్మణుల వలన, బ్రాహ్మణుల చేత, బ్రాహ్మణుల కొరకు తీయబడిన సినిమా. నేను యిక్కడ 'బ్రాహ్మణుల'ని అంటున్నది కులం చేత బ్రాహ్మణులయిన వాళ్ళను మాత్రమే కాదు. 'భారతీయ సంస్కృతి'గా పిలవబడుతున్న దానికి వారసులుగా తమను తాము భావించుకుంటున్న వారందర్నీ. అంటే భారతీయ విద్యాభవన్ తరహా ఆలోచనా విధానం కలిగిన వారందర్నీ.

భారతీయ సామాజిక వ్యవస్థను సామాన్యంగా బూర్జువా భూస్వామ్య వ్యవస్థగా పేర్కొంటుంటారు. అది దాని బాహ్యరూపం మాత్రమే. అందులో నయా వలసవాద లక్షణాలను నింపినపుడే దాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాం. భారతీయ బడా బూర్జువావర్గం ప్రగతిశీల స్వభావంగల స్వతంత్ర జాతీయ బూర్జువా వర్గం కాదు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ అంచులో బతికే పరాన్నజీవి అది. అందువల్లే వర్తమాన భారతీయ సంస్కృతిలో కనిపించే బూర్జువా కళాసాహిత్యాలేవీ స్థానికంగా వికసించినవి కావు. అవి అనుకరణ ద్వారా వచ్చిచేరినవి. దేన్ని అనుకరించాయి అవి? ఆరోగ్యకరమైన ఉదారవాద బూర్జువా సంస్కృతిని కూడా కాదు; గుత్త పెట్టుబడిదారీ – సామ్రాజ్యవాద సమాజంయొక్క కుళ్ళిపోయిన నిరాశావాదపు సంస్కృతిని అనుకరించాయి అవి. తన భవిష్యత్తు పట్ల నమ్మకంలేని ఈ సంస్కృతి నిత్యం రకరకాల అమూర్త వ్యక్తీకరణల వెనుక దాక్కోవాలని చూస్తుంటుంది. అయితే దాని అంతర్గత ప్రజాస్వామ్య తార్కికత దాన్ని ఆ పని

చేయనివ్వదు. లాభార్జన లక్ష్యంగా గల బూర్జువా కళ సామాన్య మానవుడి నుంచి పూర్తిగా దూరమై తనను తాను దాచుకోనూ లేదు. అలాగని వాస్తవాన్ని నిజాయితీగా ప్రతిఫలించనూ లేదు. అందువల్ల ప్రజల వివేకాన్ని మేల్కొలిపే బదులు వారి భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి పూనుకుంటుంది. నిజం చెప్పాలంటే వారి వివేకాన్ని నిద్రపుచ్చడానికే ఈ పనిచేస్తుంది. అందుకే మనకు వివేకంతో పనిలేని హారర్ సినిమాలు, ఉద్వేగభరిత సినిమాలు, శృంగార ప్రధాన సినిమాలు ఎక్కువగా వస్తుంటాయి. సంగీతం స్థానంలో శబ్దఘోష వినబడుతుంది. అనుకరణ సంగతి పక్కనపెడితే ప్రజల సమస్యలను పరిష్కరించే సామర్థ్యం లేకపోవడంవల్ల కూడా ఈ రకమైన చిత్రాలు వారి ప్రయోజనాలకు బాగా పనికొస్తాయి.

వీటన్నిటికంటే ముఖ్యమైనది మరోటుంది. తన పరాధీనత వలన ఈ బూర్జువావర్గం ప్రగతిశీల బూర్జువా వర్గం కంటే భూస్వామ్య వ్యవస్థతో ఎక్కువ రాజీపడాల్సి ఉంటుంది. (ఎంత ప్రగతిశీల బూర్జువా వర్గమైనా భూస్వామ్య వ్యవస్థను పూర్తిగా తుడిచిపెట్టదు. తుడిచిపెట్టగలదని యాంత్రిక దృక్పథం నమ్ముతుంది కాని అది నిజం కాదు. ఈ వర్గం ప్రజాస్వామికంగా ఉన్నట్టే ఉంటుంది కాని దాన్ని పరిపూర్ణంచేసే ప్రయత్నం మాత్రం ఎన్నటికీ చేయదు. అధికారంలో కొనసాగడానికి అది నిత్యం భూస్వామ్య వ్యవస్థతో రాజీ పడుతూనే ఉంటుంది). ఇప్పుడు ఆధిపత్య సంస్కృతిలోని రెండో సగానికి – అంటే భూస్వామ్య వర్గ సంస్కృతికి వద్దాం. ఇదీ పతనావస్థలో ఉన్నదే, కాలం చెల్లినదే అయినా పతనావస్థలో ఉన్న భూస్వామ్య సంస్కృతీ, పతనావస్థలో ఉన్న బూర్జువా సంస్కృతీ ఒకటి కాదు. భూస్వామ్య వ్యవస్థకు ప్రజాస్వామిక ఒత్తిడులు (లేదా అనివార్యతలు) ఉండవు కనక దాని సంస్కృతి మరింత ముడుచుకుపోయి మృతప్రాయమవుతుంది. జడపదార్థంగా మారిన ఈ భూస్వామ్య సంస్కృతి, 'అసభ్యకరమైన' (Vulgarised) నయా వలసవాద బూర్జువా సంస్కృతితో కలిస్తే ఏమవుతుందో అదే ఈనాడు మనకు కనిపిస్తున్న సంస్కృతి.

అందువల్ల సహజంగానే భారతీయ సినిమా సంస్కృతి కూడా మిశ్రమంగానే ఉంటుంది. వ్యాపార దృష్టితో చూస్తే ఇది వాళ్ళకు అవసరం కూడా. ఈ దేశప్రజలలో అత్యధికులు ఫ్యూడల్ వ్యవస్థ దోపిడీకి గురయిన వాళ్ళు కావడం వలన

భూస్వామ్యాన్ని నూటికి నూరు శాతం ఉన్నతంగా చూపే కళలు ఇక్కడ అమ్ముడుపోవు. ఉన్నతంగా పూర్తిగా హాలీవుడ్ తరహాలో తీసినా జనం ఆదరించరు. అలాగని దిగజారిన రెండు సంస్కృతుల సమ్మేళనం ఏ వర్గాన్నీ సంతృప్తిపరచలేదు. 'మూఢజనం' అభిరుచులకు తగ్గట్టు తీయడం బూర్జువా ఉదారవాదికి నచ్చదు. 'అశ్లీలత'కు పెద్దపీట వేయడం బ్రాహ్మణుడికి నచ్చదు. అయితే బ్రాహ్మణుడు (మంచి బూర్జువా కదా) 'అలగాజనాన్ని' సంతృప్తిపరచడానికి అటువంటి అశ్లీలత అవసరమని, లేకపోతే వ్యాపారం లాభదాయకం కాదని తనను తాను సమాధాన పరుచుకుంటాడు. అయితే ఏదో ఒక రోజు అతను తన అసలు రూపం చూపిస్తాడు. అదే శంకరాభరణం.

**శంకరాభరణం**

క్లుప్తంగా చెప్పాలంటే ఇది సంగీతం పిచ్చి ఉన్న ఒక బ్రాహ్మణుడి కథ. (శంకరాభరణ రాగం పాడడంలో అతను సుప్రసిద్ధుడు) ఈ బ్రాహ్మణుడు సంగీతం కోసం ఏమైనా చేస్తాడు. సంగీతాన్ని ప్రేమించే ఒక వేశ్య కూతురి పక్షం వహించి ఆమె కోసం సంఘ బహిష్కరణకు కూడా సిద్ధపడతాడు. వాళ్ళు నిజంగానే వెలివేస్తే ఆ కోపాన్నంతా తన ఇష్టదైవం మీద చూపించి ఉరుములు మెరుపులతో కుండపోతగా వర్షాన్ని రప్పిస్తాడు. అపస్వరం పాడిందని తన కుమార్తె పెళ్ళిని దాదాపు చెడగొట్టినంత పని చేస్తాడు. ఆమెకు సాయం చేయబోయినందుకు పెళ్ళికొడుకును కూడా బిక్కచచ్చిపోయేలా చేస్తాడు. మొత్తం సినిమాలో ఒక సందేశం మన చెవులను హోరెత్తిస్తుంది. సంగీతం, కళలు ఉన్నది కామోద్రేకాల్ని రెచ్చగొట్టడానికి కాదు. లేబర్ క్లాస్ (ఆంధ్రులకు ఇష్టమైన మాటలో చెప్పాలంటే) అశ్లీల అభిరుచులను సంతృప్తిపరచడానికి కాదు. అవి ఉన్నది 'అద్వైత సిద్ధి'కి, 'అమరత్వ లబ్ధి'కి. ఈ సినిమా కొందరి కోసమే అన్న భావం కలిగించే ప్రయత్నం మొదటి నుంచి చివరిదాకా కనిపిస్తుంది. ఎవరో కామెంట్ చేసినట్టు ఇది 'వాళ్ళకు' (అలగా జనానికి) అర్థమయ్యే సినిమా కాదు.

**మా భూమి**

అయినా నయా వలసవాద సాంస్కృతిక బానిసత్వానికి శంకరాభరణం లాంటి ఫక్తు ఫ్యూడల్ సినిమాలు కాదు ప్రత్యామ్నాయం. దానికి సరైన

ప్రత్యామ్నాయం చూపిన ఘనత 'మా భూమి' సినిమాకు దక్కుతుంది. (ఫ్రాంటియర్‌లో ఇదివరకే దీనిమీద చిన్న సమీక్ష వచ్చింది.) 1940 దశకం రెండో అర్థ భాగంలో జరిగిన తెలంగాణ రైతాంగ తిరుగుబాటు దీని ఇతివృత్తం. ప్రారంభంలోని తడబాట్లను సాంకేతిక విషయాలు బాగా తెలిసిన విమర్శకులు తప్పుపట్టచ్చు. అలాగే కొందరు నటులు గ్రామీణ తెలంగాణ మాండలికంలో సరిగ్గా మాట్లాడలేకపోయారు. ముఖ్యంగా లంబాడి అమ్మాయి పాత్రధారి మాట్లాడిన భాషయితే నేను ఏ లంబాడా అమ్మాయి నోటా విని ఎరగను.

క్లుప్తంగా దీని కథ ఇదీ – నల్గొండ జిల్లాలోని ఒక 50 వేల ఎకరాల జమీందారు వద్ద జీతగాడి కొడుకు రామయ్య. చిన్నప్పటి నుంచీ తిరుగుబాటు మనస్తత్వం ఉన్న రామయ్య అణచివేత భరించలేక, గ్రామం వదిలి, హైదరాబాద్ వెళ్ళి ఒక కర్మాగారంలో పనికి చేరతాడు. అక్కడ ఒక కమ్యూనిస్టు కార్మిక నాయకుడిని కలుసుకుంటాడు. అతని నుంచి రామయ్య, అతనితోపాటు సినిమా ప్రేక్షకులు కూడా అదనపు విలువ అంటే ఏమిటో, అక్టోబర్ విప్లవమంటే ఏమిటో తెలుసుకుంటారు. ఆ తర్వాత రామయ్య తిరిగి తన గ్రామానికి వచ్చి, అక్కడ తిరుగుబాటులో కీలకపాత్ర వహిస్తాడు. ఈ తిరుగుబాటు, అప్పటికే బీటలువారి ఉన్న నిజామ్ పాలనపై విజయం సాధిస్తుంది కానీ భారతీయ సైన్యాన్ని ఎదుర్కోలేకపోతుంది. భారత సేనల చేతిలో 'శాంతి భద్రతలు' తిరిగి స్థాపింపబడే క్రమంలో రామయ్య చనిపోతాడు.

విశ్లేషణాత్మకంగా చూస్తే ఈ చిత్రంలో మెచ్చుకోదగ్గ అంశాలు చాలా ఉన్నాయి. ఒక రైతు కార్మికుడిగా పరివర్తన చెందడం, శ్రామిక చైతన్యాన్ని అందుకోవడం, తిరిగి తన గ్రామానికి వచ్చి ప్రజాస్వామిక విప్లవాన్ని కొనసాగించడం; ఆదివాసి ఆదివాసేతరుల మధ్య ఐక్యత అవసరాన్ని నొక్కిచెప్పడం (లంబాడా అమ్మాయిపట్ల రామయ్య ప్రేమ దీనికి ప్రతీక); జాతీయ బూర్జువాగా పిలవబడే వ్యవస్థ భూస్వామ్య వ్యవస్థతో రాజీపడిన వైనాన్ని చూపడం (హైదరాబాద్‌కు పారిపోయిన రెడ్డి జమీందార్ పోలీసు చర్య తర్వాత తిరిగి గ్రామానికి వచ్చేసరికి అతని షేర్వాణి పోయి, తలమీద కాంగ్రెస్ టోపీ రావడం దీనికి అతి సుందరమైన ప్రతీక); నిజామ్‌తో పోరాడినా, కాంగ్రెస్ ప్రభుత్వం కింద మళ్ళీ

జమీందార్ ఆధిపత్యం ఏర్పడితే దాన్ని ఆమోదించేందుకు సిద్ధమై పోయిన సంపన్న రైతువర్గంలోని ద్వైదీ భావాలు – మొదలైనవన్నీ ఇందులో చాలా వాస్తవికంగా చిత్రించబడ్డాయి.

కళ కర్తవ్యం ఏమిటన్న మన ప్రశ్నకు సమాధానం ఇక్కడ దొరుకుతుంది. ప్రజలకు గత విజయాలను, వైఫల్యాలను గుర్తుచేస్తూ గడచిన సామాజిక ఉద్యమాలను విశ్లేషిస్తూ, ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసికెళ్ళేందుకు ఉపయోగపడడమే కళ కర్తవ్యం (దీని అర్థం డాక్యుమెంటరీ చేయమని కాదు). ఈ దృష్టి నుంచి చూసినపుడు హైదరాబాద్‌లో మాభూమి చిత్రం అత్యధిక ప్రజాదరణ పొందడం చాలా ఆనందం కలిగించే విషయం. దీన్ని చూస్తున్నవారు లెనిన్‌ని చదువుకున్న మేధావి వర్గం కాకుండా తమ రక్తంలో ఇంకా తెలంగాణ పోరాటస్ఫూర్తి కలిగి ఉన్న మధ్యతరగతి, శ్రామికవర్గ ప్రజలు కావడం ఎంతో సంతృప్తిని కలిగిస్తుంది.